క్లుప్తంగా

రంజాన్ తోఫా ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ముస్లిం మైనార్టీలకు రంజాన్ పండుగకు తోఫా ఇవ్వాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్, సభ్యుడు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో మంది ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసి నమాజు చదువుతారని చెప్పారు. పండుగను జరుపుకోవడానికి రంజాన్ తోఫా ఇవ్వాలని కోరారు.

ఫైజీని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ముందస్తు సమాచారం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ (ఈడీ) రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షుడు ఎంకే ఫైజీని వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జహంగీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విపక్షాల గొంతు నొక్కడంలో భాగంగానే ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసిందన్నారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు జుబేర్‌ఖాన్, విరసం నాయకుడు పినాకపాణి, షేక్ మొహిన్స్, సలీంబాషా పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి తగదు

కర్నూలు కల్చరల్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బ్రత్యబాసు విద్యార్థులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ అన్నారు. బుధవారం వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించాలని కోరిన విద్యార్థులపై తన కాన్వాయ్‌తో మంత్రి దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఆయన్ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సాగర్, అమర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూకు నిధులు కేటాయించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి వినతి పత్రం అందజేశారు. బుధవారం విజయవాడలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి పలు విషయాలను ఆయనకు వివరించారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. వర్సిటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధనేతర ఉద్యోగులకు టైం స్కేల్ మంజూరు చేయాలని కోరారు.

స్త్రీ సాధికారతకు సమానత్వం పునాది

కర్నూలు(సెంట్రల్): స్త్రీ సాధికారతకు సమానత్వం పునాది అని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సమత ముద్రించిన ప్రత్యేక సంచికను ఆమె బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబాన్ని మంచిగా తీర్చిదిద్దుతుందన్నారు. మహిళా దినోత్సవం రోజున సభలు, సన్మానాలు చేయడం పండగ కాదని, మహిళలకు ఆదరణ కల్పించినప్పుడే నిజమైన పండుగ అన్నారు. సీఎం చంద్రబాబు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. ఆయా హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. నాయకులు అరుణ, సుజాత, బాల లక్ష్మి, మాలన్ పాల్గొన్నారు.

ఈఈకి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): ఏపీఈడబ్ల్యూఐడీసీ కర్నూలు డీఈఈగా విధులు నిర్వహిస్తూ ఈఈగా పదోన్నతి పొందిన గోన నాగరాజును బుధవారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, సంఘం గౌరవాధ్యక్షులు ఎన్‌సీహెచ్ బజారన్న, సుంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మేరీ స్వర్ణలత

కర్నూలు: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ పి.మేరీ స్వర్ణలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం కర్నూలు కృష్ణానగర్‌లోని రవీంద్ర డిగ్రీ కళాశాలలో మహిళా హక్కులు, సమాన వేతనం, పనిలో గౌరవం, ఒత్తిడిని అధిగమించే పద్ధతులు, కెరీర్ కౌన్సెలింగ్ తదితర అంశాలపై విద్యార్థినులతో అవగాహన కల్పించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ మేరీ స్వర్ణలత, నాలుగో పట్టణ ఎస్ఐ గోపీనాథ్, ఏఎస్ఐ జి.లలితమ్మ, సైకియాట్రిస్ట్ చైతన్యకుమార్, సైకాలజిస్ట్ లెనిన్‌బాబు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున తదితరులు హాజరై మానసిక సమస్యలు, రుగ్మతలపై అవగాహన కల్పించారు.

- పెరుగుతున్న దంత సమస్యలు
- వైద్యుల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- పెద్దాసుపత్రిలో మెరుగైన దంత వైద్యం
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం

పళ్లు రాలుతున్నాయ్!



దంత వైద్యం చేస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): వెళ్లి బ్రష్ చేసుకోరా.. అంటే ఏం.. పులి పళ్లు తోముకుంటుందా అని అతిగా మాట్లాడే బద్ధకస్తులూ ఉన్నారు. వారికి తెలియదేమో.. పులి కూడా పళ్లు తోముకుంటుంది. కొన్ని రకాల గడ్డి, చెట్టు మొదళ్లపై పళ్లను రుద్ది శుభ్రం చేసుకుంటుంది. దానికంటే ఎక్కువ జ్ఞానమున్న మనిషే చేజేతులా ఉక్కు లాంటి పళ్లను నిర్లక్ష్యం చేసి ఊడగొట్టుకుంటున్నాడు. చిన్నతనం నుంచి స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు ఎక్కువగా తిని దంతాలను పాడుచేసుకుంటున్నాడు. పెద్దయ్యాక దూమపానం చేస్తూ, టీ, కాఫీలు అతిగా తాగేస్తూ దంతాలు చెడగొట్టుకుంటున్నారు. ఫలితంగా యుక్త వయస్సు రాకముందే దంతాలు రాలిపోతున్నాయి. ఇలాంటి వారికి అవగాహన కలిగించి దంత ఆరోగ్యం గురించి తెలియజేస్తూ పాడైపోయిన పళ్లకు చికిత్స చేసేవారే దంత వైద్యులు. ఈ నెల 6వ తేదీన జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 30 శాతం మంది ప్రజలు వివిధ రకాల దంత సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జీవనశైలి మార్పులతో పాటు మితిమీరి ఆహారం, దంతాలు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం, స్వీట్లు, చాక్లెట్లు అతిగా తినడం, దూమపానం, గుట్కా, జర్దా, కిల్లీలు నమలడం వంటి కారణాలతో దంతాలు పాడైపోతున్నాయి. అలాగే జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటిని తాగుతుండటంతో పంటిపై పచ్చని రంగు మచ్చలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు బ్రష్ చేసుకునే విధానం చాలా మందికి తెలియకపోవడం, ఏదైనా తినగానే పుక్కిలించాలనే అవగాహన లేకపోవడం వంటి కారణాలతో పిప్పిపళ్లతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక చికిత్స

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం కారణంగా దంత వైద్య సేవలు మరింత మెరుగయ్యాయి. మూడేళ్ల క్రితం ఈ విభాగంలో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేశారు. ఒక ప్రొఫెసర్, అసోసియేట్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వీరిలో పెరియో డాంటిస్ట్, ఎండో డాంటిస్ట్, ఆర్థో డాంటిస్ట్, ఓరల్ సర్జన్ ఉన్నారు. ఇక్కడ పెద్దలతో పాటు చిన్నపిల్లలకూ దంత వైద్య సేవలు అందిస్తున్నారు. పిప్పి పళ్లను సరిచేయడం లేదా తీసేయడం, ఎముక కట్ చేయడం, స్కేలింగ్ చేయడం, చిగుళ్ల వాపులు, రక్తం కారడంపై చికిత్స చేస్తున్నారు. ఏడాది క్రితం రూ.8 లక్షలతో ఓపీజీ మిషన్ (ఎక్స్ రే), రూ.8 లక్షలతో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మిషన్ (వెల్‌స్కోప్) కొనుగోలు చేశారు. గత నాలుగేళ్ల కాలంలోనే మూడు ఆధునిక దంత వైద్య చికిత్స చైర్లు వచ్చాయి.

ఉచితంగా సేవలందిస్తున్నాం



దంత వైద్య విభాగంలో ప్రస్తుతం రోజుకు 40 నుంచి 50 మంది దాకా ఓపీ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. చికిత్సకు వచ్చిన వారికి ఆధునిక వైద్య పరికరాలు, ఆధునిక చైర్లపై దంత వైద్యం చేస్తున్నాం. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి 3 నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. పాడైన దంతాలు, చిగుళ్ల వ్యాధులకు చికిత్స, పిల్లలకు వచ్చే దంత సమస్యలకు, గుట్కా తినడం వల్ల పాడైన దంతాలకు చికిత్స చేయడం, నోటి క్యాన్సర్‌తో బాధపడే వారికి చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ ఆర్.విజయకుమార్, దంత వైద్యుడు, జీజీహెచ్, కర్నూలు

అందుబాటులో ఆధునిక దంత వైద్యసేవలు



గతంలో రూట్‌కెనాల్ థెరపీకి మూడు, నాలుగు సార్లు దంత వైద్యులను సంప్రదించాల్సి వచ్చేది. ఇప్పుడు ఒకే విజిట్‌లో ఆర్‌సీటీ పూర్తి చేయవచ్చు. ఎత్తు, వంకర పళ్ల సవరణకు పూర్వం క్లిప్స్ ఉపయోగించేవారు. దీనిస్థానంలో ఇప్పుడు అలైనర్స్ ద్వారా సౌకర్యవంతంగా ఎత్తు, వంకర, సందు పళ్లను సవరించుకోవచ్చు. అల్ట్రాసోనిక్ స్కేలింగ్ సహాయంతో ఎప్పటికప్పుడు దంతాలను శుభ్రం చేసుకోవచ్చు. డెంటల్ లేజర్స్ పరికరం ద్వారా ఇంజెక్షన్స్ లేకుండా రక్తస్రావం రాకుండా కుట్లు వేయవచ్చు. తద్వారా సులువుగా చిగుళ్ల సర్జరీ చేయవచ్చు.

– డాక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి, దంత వైద్యులు, కర్నూలు

రైతులను ఆదుకోవాలి



సుందరయ్య సర్కిల్‌లో ధర్నా చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాలు

కర్నూలు(సెంట్రల్): రైతన్నను ఆదుకోవడానికి వెంటనే ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సుందరయ్య సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అఖిలపక్ష నాయకులు వెంకటస్వామి, ఎండీ అంజిబాబు, లింగన్న, అరుణ, అలివేలమ్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి సన్మానించింది గానీ ఆయన రైతుల శ్రేయస్సు కోసం చేసిన సిఫారసులను మాత్రం అమలు చేయడం లేదన్నారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టాన్ని తేవాలన్నారు. మార్కెట్ యార్డుల్లో దళారులను నియంత్రించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

కర్నూలు (సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా పోరాటాలు నిర్వహించాలన్నారు.

కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వ ప్రజాకంటక పాలనపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడిగా నియమితులైన కొట్టాల ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గిప్సన్ కాలనీలోని స్వగృహంలో ఎస్వీ దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. 9 నెలల్లోనే కూటమి పాలనపై ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు సర్కార్‌పై ఏ వీధికి వెళ్లిన శాపనార్థాలు వినిపిస్తున్నాయన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం.. రంగనాథుని కల్యాణం





కల్యాణమూర్తులుగా శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి వారు, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: గోదా గోకులంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి వారి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. గోదా గోకులం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం ఉభయ దేవేరులను సువర్ణ భూషితులుగా అలంకరించి రంగనాథునితో కల్యాణం జరిపించారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామనుజ జీయర్ స్వామి కల్యాణోత్సవం విశిష్టతను వివరించారు. అలాగే స్వామివారికి హనుమద్వాహన సేవ నిర్వహించారు. గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి కేటాయింపులేవీ?

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించినప్పటికీ బడ్జెట్లో గృహ నిర్మాణ శాఖకు కేటాయింపులు లేకపోవడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు ఏ.శేఖర్, లెనిన్‌బాబు, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ పనుల పరిశీలన



నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పరిశీలించారు. బిల్డింగ్ మాస్టర్ ప్లాన్, కన్‌స్ట్రక్షన్ వర్క్, పలు అంశాలకు సంబంధించి ఇంజినీర్లతో మాట్లాడారు. పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ తదితరులు ఉన్నారు.

ఎస్పీ తనిఖీ



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: సమస్యలపై స్టేషన్‌ను ఆశ్రయించిన వారి పట్ల మర్యాదపూర్వకంగా మసలుకొని సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. కర్నూలులోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తునకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మథ విజయ్ తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.


7 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో బుధవారం ఏడు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి తెలిపారు. 20,496 మంది విద్యార్థులకుగాను 20,147 మంది పరీక్షలకు హాజరుకాగా 328 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల్లోనూ..

ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఒకరు మాల్ ప్రాక్టీస్ పాల్పడడడంతో కేసు నమోదు చేసినట్లు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ తెలిపారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారంగా టీకాలు ఇవ్వడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. నగరంలోని జొహరాపురం-1 పరిధిలోని 40వ సచివాలయంలో బుధవారం వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను మాతాశిశు సంరక్షణ కార్డులో సూచించిన తేదీ ప్రకారం ఇవ్వాలన్నారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించి, ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించవచ్చన్నారు. గర్భిణులకు కిల్కారీ వాయిస్ మెసేజ్ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త కిరణ్ శైలజ, ఆశా కార్యకర్త వెంకటేశ్వరి పాల్గొన్నారు.

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 22వ తేదీన చేపట్టిన బది లీల సందర్భంగా కల్లూరు స్టేషన్‌ను ఎవరూ కోరుకోలేదు. అప్పటి నుంచి జిల్లా రిజిస్ట్రార్ (చిట్స్) కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో బుధవారం సబ్ రిజిస్ట్రార్‌గా నియమతులైన ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: జిల్లా పోలీసు శాఖ నిఘా విభాగం (స్పెషల్ బ్రాంచ్) ఏఎస్ఐ చింతకుంట మాధవ రెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. తిలక్ నగర్‌కు చెందిన బిన్నేని పుల్లయ్య, ఎన్‌టీఆర్ నగర్ – యశ్వంత్ ఆచారి, బుధవారపేట రాజీవ్ గృహకల్ప – సురసుర సాయి, సప్తగిరి నగర్ – వడ్డెపల్లి గంటిపోగు నవీన్ తదితరులు గత నెల 27న నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఎస్ఎల్‌వీ చికెన్ కడ్డీలు కాల్చే దుకాణం వద్ద మద్యం మత్తులో అల్లరి చేస్తుండగా అటుగా వెళ్తున్న స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ మాధవరెడ్డి నివారించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఏఎస్ఐతో గొడవ పెట్టుకుని రాయితో కొట్టి నిందితులు పారిపోయారు. ఈ మేరకు మాధవరెడ్డి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను నంద్యాల చెక్‌పోస్టు వద్ద అరుంధతి నగర్‌కు వెళ్లే రస్తాలో ఉన్న టీవీ టవర్స్ వద్ద అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

అద్దె బకాయిలు చెల్లించాలి

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ పరిధిలోని షాపుల యజమానులు అద్దె బకాయిలు చెల్లించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు కోరారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఇండోర్ స్టేడియంలో దుకాణదారుల నుంచి అద్దె వసూలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోపు స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్రతి షాపుదారుడు అద్దె చెల్లించాలని లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్టేడియం సిబ్బంది శేషఫణి ఉన్నారు.

జలవనరుల శాఖలో అడ్‌హాక్ పదోన్నతులు

కర్నూలు (సిటీ): జలవనరుల శాఖలో మరోసారి అడ్‌హాక్ పదోన్నతులు కల్పించారు. కర్నూలు ప్రాజెక్ట్స్ ఇన్‌చార్జ్ సీఈగా పనిచేస్తున్న షేక్ కబీర్ బాషాకు పదోన్నతి కల్పించి రెగ్యులర్ సీఈగా నియమించారు. అలాగే హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎంఎల్‌వీ వరప్రసాద్‌కు సీఈగా అడ్‌హాక్ పదోన్నతి కల్పించారు. తెలుగుగంగ తిరుపతి చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. వీరు పర్యవేక్షక ఇంజినీర్లుగా పనిచేస్తున్న స్థానాల్లో త్వరలో ఆ శాఖలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సైతం పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయనున్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, జిల్లా అధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని శాఖలు సమన్వయంతో మహిళా దినోత్సవం నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాలకు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని సూచించారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

మహిళా సంఘాల్లో విజయవంతంగా రాణిస్తూ వ్యాపారాలు చేస్తున్న వారిని సన్మానించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద బ్యాంకు రుణాల మంజూరు, బ్యాంకు లింకేజీ, ఇతర ఆర్థిక సహాయాలపై మెగా చెక్కులను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, మెప్మా పీడీ నాగ శివలీల, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

డిగ్రీ ఎస్ఎస్‌కు 9 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం మొత్తం 11 కేంద్రాల్లో 142 మందికిగాను 133 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

సమావేశం వాయిదా

కర్నూలు(సిటీ): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. తదుపరి సమావేశం నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి.

ఈఓ బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: కర్నూలు బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయ స్వామి ఆలయం ఈఓగా ఆది జంబులమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల రోజుల కిందట నియామకం కాగా వివిధ కారణాలతో జాప్యం జరగడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.